www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 13 జూన్ 2024
5
చిత్తూరు

తిరుమలలో చంద్రబాబు కుటుంబం



పులివర్తి నానితో నారా చంద్రబాబునాయుడు

నేటి ఉదయం శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి - తిరుమల

ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకార ఘట్టం ముగిసిన వెంటనే నారా చంద్రబాబునాయుడు కుటుంబంతో సహా తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు బుధవారం రాత్రి విచ్చేశారు. భార్య భువనేశ్వరి, కొడుకు నారా లోకేష్, కోడలు బ్రహ్మణి, మనవడు దేవాన్ష్‌తో పాటు నందమూరి బాలకృష్ణ కుటుంబ సభ్యులు వీరితో పాటు ఉన్నారు. టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి సెలవులో ఉన్న నేపథ్యంలో టిటిడి జెఈవో వీరబ్రహ్మం వీరికి ఘనంగా స్వాగతం పలికారు. సిఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత కుటుంబంతో కలిసి మొదటి పర్యటనగా తిరుమలకు విచ్చేశారు. టిడిపి శ్రేణులతో తిరుమలలో ఆప్యాయంగా పలకరించారు. గాయత్రి నిలయంలో రాత్రి బస చేయనున్నారు. గురువారం ఉదయం 7.15 గంటలకు కుటుంబంతో కలిసి శ్రీవారిని దర్శించుకుంటారు. అనంతరం తిరిగి రాజధాని అమరావతి కి చేరుకుంటారు. తిరుమల చేరుకున్న సమయానికి వర్షం పడుతుండడంతో కుటుంబీకులందరూ గొడుగుల్లో బస కేంద్రాలకు వెళ్లడం కనిపించింది.

తిరుమలలో నారా లోకేష్

చంద్రబాబుకు ఘన స్వాగతం

నారా చంద్రబాబునాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. బుధవారం రాత్రి 7.35 గంటలకు కుటుంబ సమేతంగా చేరుకున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండోమెంట్స్ కరికాల వలనన్, డిఐజి షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ప్రవీణ్‌కుమార్, షన్మోహన్, తిరుపతి ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు, ఎంఎల్‌ఎలు బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, చిత్తూరు జెసి శ్రీనివాసులు, టిటిడి జెఇఒ గౌతమి, తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో తిరుమల శ్రీవారి దర్శనార్థం బయల్దేరి వెళ్లారు.

పర్యటనకు భారీ బందోబస్తు

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుపతి, తిరుమల పర్యటన సందర్భంగా డిఐజి షిమోషి బాజ్ పాయ్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్, చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ నరసింహాకిషోర్ సంయుక్తంగా కాన్వాయ్ రిహార్సల్ నిర్వహించారు. 1550మంది సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ వెంకట్రావు, కులశేఖర్, విమల కుమారి, అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ముడు రిజర్వ్,ఎస్పీ డీస్పీ వేంకటాద్రి, రేణిగుంట డిఎస్పి భవ్య కిషోర్ పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్లాన్ రెడీ.!



- ఊరిస్తున్న నైరుతి రుతుపవనాలు
- కోటి ఆశలతో సన్నద్ధమవుతున్న రైతులు
- ఉసూరుమనిపించిన మామిడి

దుక్కులు సిద్ధం చేసిన రైతులు

మామిడి దిగుబడిపై కోటి ఆశలు పెట్టుకున్న రైతులకు ఈ దఫా నిరాశే మిగిలింది. తొలత పూత కోసం చేసిన ప్రయత్నాలు విఫలం కావడం, ఆశించిన మేరా కాత రాకపోవడంతో రైతులు పూర్తిగా ఆశలొదులుకున్నారు. గతేడాధితో పోలిస్తే ఈ దఫా నైరుతి రుతుపవనాలు సకాలంలో రావడంతో ఖరీఫ్ పంటలపై రైతన్నలు ఆసక్తి చూపుతున్నారు. ఆ మేరకు సాగుకు సన్నద్ధమవుతున్నారు.

- ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్

నైరుతి రుతుపవనాలు విస్తారంగా కురుస్తున్నాయి. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం 80.8మి.మి కాగా మొదటి వారంలోనే 75.4మి.మి వర్షపాతం ఇప్పటికే నమోదైంది. ముందుగా అధిక శాతం నమోదైన వర్షపాతంతో రైతన్నల్లో ఖరీఫ్‌పై కోటి ఆశలు చిగురించాయి. వివిధ రకాల పంటలపై ఇప్పటికే పూర్తి స్థాయిలో రెడీ అయ్యారు. ఆ మేరకు వరి, చెరకు, కూరగాయలు, వేరుశనగ సాగుపై ఇప్పటికే సన్నద్ధమైయ్యారు. ఆ మేరకు దుక్కులు పూర్తి చేస్తున్నారు. జిల్లాలో 1,88,301హెక్టార్లు ఖరీఫ్ సాగు విస్తీర్ణం కాగా ఇందులో 55,661హెక్టార్లు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఈ ఏడాధి ఖరీఫ్ సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

పంట రుణాలు మంజూరు చేయాలని వేడుకోలు

ఆశించిన మేరా వర్షాలు కురుస్తుండగా ఖరీఫ్ సాగుకు విరివిగా పంట రుణాలు మంజూరు చేయాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. జిల్లాకు సంబంధించి గత ఏడాధి ఖరీఫ్ రైతులకు రూ.7,887కోట్లు ప్రభుత్వం నుంచి పొందారు. ఈ దఫా అదేవిధంగా రుణసాయం అందించాలని కోరుతు న్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన ఎరువులు, పురుగు మందులు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

సీజన్ ప్రారంభంకాకనే వేరుశనగ పంపిణీ..

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాకముందే రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై వేరుశనగ విత్తనకాయలను అందించింది. చిత్తూరు జిల్లాకు సంబంధించి 38వేల క్వింటాళ్ళ విత్తనాలను ఆర్‌బీకే కేంద్రాల ద్వారా ఇప్పటికే పంపిణీ చేసింది. ఆ మేరకు రైతులు వేరుశనగ పంటలకు సంబంధించి ఇప్పటికే దుక్కులు సిద్ధం చేశారు. మరికొన్ని చోట్ల విత్తనాలను విత్తారు. సకాలంలో పలకరించిన నైరుతి రుతుపవనాల తాకిడికి అన్నదాతలో కోటి ఆశలతో సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ముంచిన మామిడి..

ఈ ఏడాది జిల్లాలో దిగుబడి 12 నుంచి 15శాతం మించి పంట దిగుబడి అందలేదు. జిల్లాలోని వేలాది మంది మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలోని ప్రధాన మామిడి మార్కెట్ యార్డులు మామిడి పంటను మార్కెట్లకు తరలించక పోవడంతో వెలవెల బోతున్నాయి. తోతాపూరి రకం కూడా అంతంత మాత్రం కావడంతో ఈ ఏడాది జిల్లాలోని అనేక మామిడి గుజ్జు పరిశ్రమలు గుజ్జు తయారీ మానుకున్నాయి. జిల్లాలోని అది పెద్ద గుజ్జు పరిశ్రమ జీడి నెల్లూరులోని జైన్ పండ్ల గుజ్జు పరిశ్రమ ఏటా మామిడి సీజన్‌లో వందలాది మంది ఉపాధి పొందుతుంటారు. మే, జూన్ మాసాల్లో జైన్ ఫ్యాక్టరీ ఎదుట వందలాది వాహనాలు రోజుల తరబడీ అన్‌లోడింగ్ కోసం వెచి ఉండే పరిస్థితి. ప్రస్తుతం ఈ ఫ్యాక్టరీ నామమాత్రంగా నడుస్తోంది. ఎప్పుడూ లేని విధంగా తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులు నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ వేరుశనగ పంటపై గంపెడు అశాలు పెట్టుకున్నారు. ఖరీఫ్ రైతులను అదుకొనేలా పంట ఋణం అందించడంతో పాటు ఎరువులు, పురుగు మందులు అందించాలని కోరుతున్నారు.

ఇప్పుడు సాగుకు అనుకూలం

మురళీకృష్ణ, వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్

జిల్లాలో ఖరీఫ్ సాగుకు అనుకూలంగా నైరుతి రుతుపవనాల వర్షపాతం నమోదు అవుతోంది. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో ఖరీఫ్ రైతులు సాగుకు సిద్ధం అవుతున్నారు. ముందస్తుగా 38వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయలు ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీ ధరకు అందించాం. ఈ ఏడాది సాగు విస్తర్ణం పెరిగే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాలతో వేరుశనగ రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి రైతు తాము పండించిన పంటకు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఏనుగులను నిలువరించేందుకు ప్రత్యేక చర్యలు

సిసిఎఫ్ నాగేశ్వరరావు

ననియాల ఎకో టూరిజం వద్ద పరిశీలిస్తున్న సీసీఎఫ్ నాగేశ్వరరావు

ప్రజాశక్తి-రామకుప్పం: రైతుల పంట పొలాల్లోకి ఏనుగుల మంద రాకుండా కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీసీ నాగేశ్వరరావు తెలిపారు. రామకుప్పం మండల సరిహద్దులోని అటవీ ప్రాంతంలో ఏనుగుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన స్పష్టం చేశారు. డీఎఫ్‌వో చైతన్య కుమార్ రెడ్డితో కలిసి బుధవారం ననియాల ఎకో టూరిజం వద్ద పర్యటించారు. అటవీ సిబ్బందికి ఏనుగుల కదిలికులపై ప్రత్యేక దృష్టి సారించాలని, రైతుల పండిస్తున్న పంట పొలాల వైపు వెళ్లకుండా కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా వేసిన జంగిల్ సఫారీ రోడ్లను పరిశీలించారు. ఎకో టూరిజం పార్కును అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఆదేశించారు. మొక్కల పెంపకం, నర్సరీని పరిశీలించి విరివిగా మొక్కలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. అనంతరం ట్రైనీ ఏనుగులు జయంత్, వినాయక్‌లను పరిశీలించి వాటి సంరక్షణకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కుప్పం రేంజ్ అధికారి జయశంకర్, రామకుప్పం డిఆర్‌ఓ వైసిరెడ్డి, ఫారెస్టర్ బాబుప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రచయితలకు సాహితీ పురస్కారాలు

పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్:

ప్రతిభ కనబరచిన రచయితలు కుప్పం రెడ్డమ్మ సాహితీ పుర స్కారాలను అందు కున్నారు. రచయి తల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కట్ట మంచి బాలకృష్ణరెడ్డి అధ్యక్షతన బుధవారం చిత్తూరు రాజామహల్‌లో కుప్పం రెడ్డెమ్మ 31వ సాహితీ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన రచయితలు, కవులను కుప్పం రెడ్డమ్మ సాహితీ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ రామలక్ష్మి, అధ్యక్షులు రోజా ప్రియ, కార్యదర్శి డాక్టర్ నిరంజన్‌రెడ్డిలు ఘనంగా సన్మానించి అవార్డులు ప్రదానం చేశారు. రామ లక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రతి ఏటా కుప్పం రెడ్డమ్మ సాహితీ పురస్కారాల పేరుతో ఎంతోమంది ప్రతిభ కనబరచిన రచయితలు సాహితీ కళాకారులను అవార్డులతో సన్మానిస్తు న్నామన్నారు. ఈ ఏడాది ప్రముఖ రచయిత లైన ముని సురేష్ పిల్లాయి, కాశీపురం ప్రభాకర్ రెడ్డి, నల్ల సూర్యుడు, రోహిణి వంజాని, సుగుణ రావులను అవార్డులతో ఘనంగా సత్కరించారు. అనంతరం అవార్డు గ్రహీతలు వారి సాహిత్య కథానికలను వినిపించారు. కార్యక్రమంలో గంటా మోహన్, సహదేవ నాయుడు, ఎడ్ల బాలకష్ణారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

రజనీకాంత్‌ని కలిసిన చిత్తూరు ఎంపీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్‌ను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు బుధవారం గన్నవరం విమానాశ్రయంలో కలిశారు. చిత్తూరు ఎంపీగా దగ్గుమళ్ళ ఘన విజయం సాధించడంపై ఆయన అభినందించారు. ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవాన్ని పురస్కరించుకొని రజనీకాంత్ విజయవాడకు విచ్చేశారు.

పిల్లలు పనిలో కాదు బడిలో ఉండాలి

- పిల్లలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసులు
- 1098కు కాల్ చేసి చెప్పండి
- శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: బాల కార్మికుల నిర్మూలన వ్యవస్థ పట్ల పోరాటం ఒక యుద్ధంగా అందరం ఒక సంకల్పంతో పని చేయాలని శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక గాంధీ సర్కిల్‌లో జిల్లా కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓం కార్ రావుతో కలసి అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ బాల కార్మికుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ర్యాలీని ప్రారంభించడం జరిగిందన్నారు. కేవలం ర్యాలీతోనే బాల కార్మికుల నిర్మూలన జరుగుతుందని అనుకోవడం సరికాదని, బాల కార్మికుల నిర్మూలన వ్యవస్థ పట్ల పోరాటం ఒక యుద్ధంగా అందరం ఒక సంకల్పంతో పని చేయాలవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. 14సంవత్సరంలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవ్యతిరేకమన్నారు. పిల్లలు చదువుకుంటే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. బాలలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి జగదీష్ బాబు, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నాగమణి, పిల్ల సంరక్షణ అధికారి శివకుమార్, డిఈఓ ఆఫీస్ నుంచి అజేయకుమార్ రెడ్డి, రోప్ స్వచ్ఛంద సంస్థ నుంచి ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుదాం

- మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: సమస్యలు పరిష్కరిస్తూ ముందుకు సాగుదామని మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం అన్నారు. బుధవారం నగరి మున్సిపల్ కార్యాలయంలో నీలమేఘం అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ ఆదేశానుసారం మున్సిపల్ అధికారులు సమావేశపు అజెండాను సభ్యులకు చదివి వినిపించారు. అజెండాలో ఏవైనా అభ్యంతరాలున్నా, వార్డుల్లో ఏవైనా సమస్యలు ఉన్నా తెలపాలంటూ మున్సిపల్ ఛైర్మన్ సభ్యులను కోరారు. వైస్‌ఛైర్మన్ వెంకటరత్నం మాట్లాడుతూ 1వ వార్డులో కల్వర్టు నిర్మించాల్సి ఉందని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తమ వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో పగటిపూట కూడా దీపాలు వెలుగుతోందని వాటిని సరిచేయాలన్నారు. మున్సిపల్ ఛైర్మన్ మాట్లాడుతూ అధికారులు వార్డులో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ప్రజావసరాలను పరిష్కరిస్తూ ముందుకు సాగాలన్నారు. సమావేశంలో వైస్ ఛైర్మన్‌లు బాలన్, వెంకటరత్నం, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉజ్వల భవితకు ఐటీఐ

- విద్యార్థుల నైపుణ్యానికి పెద్దపీట
- కోర్సు పూర్తికాగానే మెండుగా ఉపాధి అవకాశాలు
- స్వల్పకాలిక వ్యవధిలోనే స్థిరపడుతున్న విద్యార్థులు



మెకానికల్ డీజల్పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ఎలక్ట్రానిక్స్ మెకానిక్పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఐటీఐ కళాశాలలు యువతలో నైపుణ్యాన్ని పెంపొందించి పరిశ్రమలకు అందిస్తున్నాయి. ఐటీఐలు కావాల్సినంత భరోసానిస్తూ బంగారు భవితకు బాటలు పరుస్తున్నాయి. ఐటిఐలలో చేరిన విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన మెళుకువలపై పట్టు సాధిస్తుండడ ంతో కోర్సుపూర్తవగానే మెండుగా ఉపాధి అవకాశాలు లభిసున్నాయి. స్వల్పకాలిక వ్యవధిలోనే జీవితాల్లో స్థిరపడుతూ కుటుంబాలకు ధన్నుగా నిలుస్తున్నారు.

ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు..

జిల్లాలోని పలు ఐటీఐలు సంప్రదాయ కోర్సులతో పాటు ఒక్కోకోర్సుకు ప్రాధాన్యతనిస్తూ, ప్రత్యేకత చాటుకుంటుంది. కార్వేటినగరంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎలక్ట్రిషన్, కోఫ, డఓఈజల్మెకానికల్, ఫిటర్, ఎలక్ట్రానిక్ మెకానిక్ వంటి కోర్సులు చేసిన విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొంది స్థిరపడ్డారు.

కోర్సు మధ్యలోనే ఆన్ జాబ్ ట్రైనింగ్

విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆన్ జాబ్ ట్రైనింగ్(ఓజేటీ) విధానాన్ని తీసుకొచ్చారు. విద్యార్థులు చదుతుండగానే మధ్యలో ఓజేటీకి పంపుతున్నారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, వంటి ప్రముఖ నగరాల్లోని వివిధ సంస్థలో మూడు నెలలు, ఆరు నెలలు వ్యవధితో సంబంధిత అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఈ సమయంలో విద్యార్థులకు ఆయా సంస్థలు స్టయిఫండ్గా కొంత మొత్తం చెలిస్తుండడం గమనార్హం. కోర్సు పూర్తి అయిన తర్వాత అవే సంస్థల్లో ఉద్యోగులుగా స్థిరపడాలనే సంకల్పంతో ఈ పద్ధతిని తీసుకొచ్చినట్లు తెలిసింది. 2023-24 విద్యా సంవత్సరంలో జిల్లా నుంచి 264 మంది ఓజేటీకి వెళ్లారు.

కోర్సులివే..

కోపా(ఏడాదికోర్సు), మాన్ సినిల్ (రెండేళ్లు), ఎలక్ట్రియన్ (రెండేళ్లు), ఎలక్ట్రానిక్స్ మెకానిక్ (రెండేళ్లు, ఫిట్టర్ (రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (రెండేళ్లు), మెకానికల్ డీజల్ (ఏడాది) టర్నర్(రెండేళ్లు), వైర్మెన్ (రెండేళ్లు), వెల్డర్ (ఏడాది), రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషన్ టెక్నీషియన్(రెండేళ్లు), డ్రస్మేకింగ్ (ఏడాధి), ప్లంబర్ (ఏడాధి), ఇన్స్టుమెంట్ మెకానిక్(రెండేళ్లు), ఐసీటీఎస్ఎం (రెండేళ్లు) మెషినిస్ట్ (రెండేళ్లు) ఉంటుంది.

ఉజ్వల భవిత అందించాలనే సంకల్పం

ఐటీఐలో చేరిన విద్యార్థులకు ఉజ్వల భవిత అందించాలన్నదే మా ప్రధాన సంకల్పం. ట్రేడ్ల పాఠాలతో పాటు భావ వ్యక్తీకరణ, వ్యక్తిత్వ వికాస అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. చాలామంది మా విద్యార్థులు పెద్ద పెద్ద కంపెనీల్లో ఉదోగాలు పొందడం సంతోషకరం. **పి.గణేష్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, కార్వేటినగరం**

మెళుకువలు నేర్చుకున్నా..

ఎలక్ట్రియన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతున్నా. నేను అమరరాజ కంపెనీలో ఓజేటీకి వెళ్లి నేను తీసుకున్న ఎలక్ట్రియన్ కోర్సులో కొన్ని మెళుకువలు నేర్పించారు. కోర్సుతో పాటు నెలకు రూ.5 వేలు స్టయిఫండ్ ఇచ్చారు.

- జ్ఞానేశ్వర్, ఎలక్ట్రిషియన్ విద్యార్థి, కార్వేటినగరం

రూ.10వేలు స్టయిఫండ్ ఇచ్చారు..

ఎలక్ట్రానిక్ మెకానిక్ రెండో సంవత్సరం చదుతున్నా. చెన్నైలోని సుందరం ఫాస్టనమిటెడ్ కంపెనీలో ఓజేటీకి వెళ్లా, కర్మాగారంలో స్ప్రింగ్లు తయారు చేయడం నేరుకున్నా. నెలకు రూ.10వేలు స్టయిఫండ్ ఇచ్చారు. **- ఆర్,జీ, జగదీష్, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం**

డ్రస్ మేకింగ్ నేరుకున్నా..

కార్వేటినగరం ఐటీఐలో డ్రస్మేకింగ్ నేర్చుకున్నా. ఏడాధికి పూర్తి స్థాయిలో నేర్చుకున్నా. ఇప్పుడు ఇంటి వద్దనే నేర్చుకున్న డ్రెస్ మేకింగ్తో ఆర్థికంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఐటీఐ కోర్సువల్ల నా కుటుంబాన్ని పోషించుకునే ఆధాయాన్ని పొందుతున్నాను. **దీక్షిత, ఐటీఐ విద్యార్థి, కార్వేటినగరం**

సీఎం ప్రమాణ స్వీకారోత్సవం..

ఊరువాడ సంబరం

పుంగనూరులో

బైరెడ్డిపల్లిలో

కార్వేటినగరంలో

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఏపీ సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా చిత్తూరు నగరంలోని గాంధీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన పెద్ద ఎల్ఈడి స్క్రీన్‌పై బుధవారం కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. నగర పాలక కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశేష సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక నాగాయ్య కళక్షేత్రంలో ప్రత్యక్ష ప్రసారాన్ని జిల్లా అధికారులు, స్వయం సహాయ సంఘాల మహిళలు పెద్ద సంఖ్యలు ప్రజలు వీక్షించారు. కలెక్టర్ ఎస్.షన్మోహన్, జెసి శ్రీనివాసులు, డిఆర్‌వో పుల్లయ్య, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పూతలపట్టు: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీలలో సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవాన్ని ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రజలు, టీడీపీ అభిమానులు తిలకించారు. గ్రామాల్లో టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

చిత్తూరుడెస్క్: సీఎంగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేయడంతో నగరి పట్టణ తెలుగు తమ్ముళ్ల పెద్ద ఎత్తున సంబరాలు చేశారు. నగరి మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు శ్రీ దేశమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. భక్తులకు స్వీట్లు పంచారు. నగిరి టవర్ క్లాక్ వద్ద ఎన్టీఆర్ విగ్రహమునకు గజమాలవేసి పెద్ద ఎత్తున బాణా సంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

పుంగనూరు: నారా చంద్రబాబు నాయుడు 4వ సారీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా పుంగనూరులో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్లో బుధవారం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ఎల్ఈడి టీవీ భారీ స్క్రీన్ ఏర్పాటుచేసి ప్రదర్శన చేపట్టారు. రూరల్, అర్బన్ నాయకులు తూర్పు మగసాల నుంచి ప్రదర్శనగా భారీగా బాణాసంచాలు పురవీధుల్లో కాల్చుతూ ఎన్టీఆర్ సర్కిల్ చేరుకున్నారు. మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాష్ ఆధ్వర్యంలో డీజే ఏర్పాటు చేసుకుని పట్టణ పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అన్నదాన చేపట్టారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సివిరెడ్డి, పోలీస్ గిరి, వెంకటముని, సయ్యద్, సుహేల్ బాషా, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని మండల కార్యాలయ ఆవరణలో అధికారులు ప్రత్యక్ష ప్రసారాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయం అంతా పచ్చ తోరణాలు, వివిధ రంగుల పూలతో సుందరంగా అలంకరించి, పండుగ వాతావరణంగా కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. నూతన ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమాలు వేగవంతం చేయాలని ప్రజలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరయ్య, పిఓపిఆర్డి రాధాకృష్ణ, ఏపిఎం లావణ్య, అధికారులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: కార్వేటినగరం, కెఎం పురం గ్రామాలలో చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణ అధ్యక్షులు జగన్నాథం, సీనియర్ నాయకులు వాసదేవరెడ్డి, నటరాజు, కుమార్ మొదలి, నడింపల్లి యువరాజ్, నమేష్ ఆధ్వర్యంలో కెక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. పెద్దఎత్తున బాణా సంచా పేల్చి అభిమానం చాటుకున్నారు. నాయకులు ధనంజయరాజు, సోమశేఖర్ యాదవ్, జనసైనికులు సురేష్ రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్రం ఎన్నడు లేని విధంగా అభివృద్ధి చెందుతుందని, అదేవిధంగా మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో దక్షిణామూర్తి, మునిరాజు, ముని కుమార్, వెంకటేష్ రాజు, లోకేష్, బాలాజీ పాల్గొన్నారు.

సోమల: సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజలు వీక్షించే విధంగా టీవీల ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను చేశారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని తిలకించారు. మండల కేంద్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పెద్దఎత్తున బాణాసంచా పేల్చి స్వీట్లు పంచిపెట్టారు.

గంగాధర నెల్లూరు: సీఎంగా చంద్రబాబు, మంత్రివర్గ ప్రమాణ స్వీకారాన్ని స్థానిక ప్రజలు వీక్షించేందుకు ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ప్రొజెక్టర్‌ని అధికారులు ఏర్పాటు చేశారు. 4వ సారి చంద్రబాబు సీఎం కావడంపై పలువురు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏవో సుధాకర్, ఏపీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా, వీఆర్వో ఫాతిమా, అధికారులు పాల్గొని వీక్షించారు.

సదుం: ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా సదుం బస్టాండ్ కూడలిలో టీడీపీ నాయుకులు పెద్ద ఎత్తున బాణాసంచ పేల్చి, స్వీట్లు పంచుకొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డిప్రసాద్ రెడ్డి, నారాయణ, శ్రీనివాసులు రెడ్డి, వెంకటరమణా రెడ్డి, కృష్ణయ్య, అమరనాథ గౌడ్, యర్రంరెడ్డి, అమర్నాథ్, వెంకటరమణ, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: చంద్రబాబు ఏపీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలోని 23 పంచాయతీలలో అభిమానులు పెద్దఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌లో ప్రమాణస్వీకారోత్సవాన్ని ప్రజలు తిలకించారు. కార్యక్రమంలో సర్పంచులు డీవీ డిల్లెయ్య, మార్కొండయ్య, నాయకులు వినోద్‌కుమార్, యోగేశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు బుధవారం ప్రమాణ స్వీకార చేసిన సందర్భంగా మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్‌ల ద్వారా ప్రజలు కార్యక్రమాన్ని వీక్షించారు. మంగళవారం రాత్రి విద్యుత్ దీపాలతో, తోరణాలతో ప్రభుత్వం కార్యాలయాలను అలంకరించారు. అదేవిధంగా బుధవారం మండలంలోని కంభం పల్లి పంచాయతీ పరిధిలో ఉన్న సచివాలయంలో సర్పంచ్ ఆదేశాల మేరకు జయసుబ్రహ్మణ్యం, జయరాము, రెడ్డప్పలు టిడిపి జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. రమాదేవి, బాబు రెడ్డి సుబ్రమణ్యం, జయరాం, రెడ్డప్ప, నారాయణ శెట్టి, పాండురంగయ్య, వెంకటప్ప శెట్టి పాల్గొన్నారు.

పలమనేరు: చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా పట్టణంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున అభిమానులు హాజరై కార్యక్రమాన్ని తిలకించారు.

పూతలపట్టులో

సదుంలో

చిత్తూరులో

సోమలలో

తటాకాం పూడింది..

- తారు రోడ్డుపై తటాకం వార్తకు స్పందన
- మట్టితో తాత్కాలిక మరమ్మతులు చేయించిన సర్పంచ్

ప్రజాశక్తి-సోమల: సోమల నుంచి నంజంపేట వెళ్లే ప్రధాన రహదారిలో సోమల సచివాలయం సమీపంలో తారు రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలలో నీరు నిలచి వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయంగా ఈనెల 8వ తేదీన ప్రజాశక్తి దినపత్రికలో 'తారు రోడ్డుపై తటాకం' శీర్షికన వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ సర్పంచ్ గుంతలపై మట్టిని తోలి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ప్రస్తుతం గుంతలు కనుమరుగై బురద నీరు కూడా లేకుండా వాహనదారులు పాదాచారులు సునాయాసంగా వెళ్లే విధంగా సౌకర్యం కలిగింది. దీనిపై పలువురు ప్రజాశక్తికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నాడు

నేడు

ఘనంగా విజయం విద్యాసంస్థల 25వ ఆవిర్భావ వేడుకలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మిట్టూరులోని విజయం విద్యాసంస్థల్లో 25వ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. 2000 సంవత్సరం జూలై 12వ తేదీ కేవలం పది మంది విద్యార్థులతో విజయం కాంపిటీటివ్ సర్కుల్‌గా ప్రారంభమైన విజయం విద్యాసంస్థ నేడు స్కూల్ స్టేట్ అండ్ సీబీఎస్ఈ, జూనియర్, డిగ్రీ, హోటల్ మేనేజ్మెంట్, బిజినెస్ స్కూల్, ఎంబీఏ అండ్ ఎంసీఏ విభాగాల్లో దాదాపు 6వేల మందికి విద్యను అందిస్తూ చిత్తూరులోనే కాక రాష్ట్రస్థాయిలో ఒక అత్యున్నతమైన విద్యాసంస్థగా రూపుదిద్దుకుంది. విజయం విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎం.తేజో మూర్తి మాట్లాడుతూ తమ విద్యాసంస్థలు విలువలతో కూడిన విద్యను అతి తక్కువ ఫీజులతో అందిస్తూ చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాల్లో 12 మండలాల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలను వేలాదిమంది విద్యార్థులకు చదువుతోపాటు చక్కటి వాతావరణాన్ని కల్పిస్తూ క్రమశిక్షణకు నైపుణ్యాన్ని పెంచడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల మన్ననలు పొందడం అభినందనీయమని తెలిపారు. విజయం డిగ్రీ కళాశాల ఎన్ఏఏసి ఏ ప్లస్ గ్రేడ్‌తో జాతీయస్థాయిలో గుర్తింపు పొందడానికి తమ విద్యా ప్రమాణాలు నిదర్శనమని పేర్కొన్నారు. ఐటిఐ నెట్ కొరకు న్యూఢిల్లీకి చెందిన మై క్లాస్ రూమ్ వారి సహకారంతో డాక్టర్ విట్ అనే నూతన విభాగాన్ని ప్రారంభించామన్నారు. దీని ద్వారా చిత్తూరు పరిసర ప్రాంతపు విద్యార్థులకు ఐఐటీలు పెట్టుకున్నామని పేర్కొన్నారు. 2024-25వ విద్యా సంవత్సరం నుంచి విద్యావ్యవస్థలో నూతన ఒరవడి సృష్టిస్తూ విజయం ఇన్స్టిట్యూట్ విజయం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విజయం ద స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ మూర్తి మాట్లాడుతూ 24 సంవత్సరాలుగా విజయం విద్యాసంస్థలను ఆదరిస్తున్న విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విజయం విద్యాసంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి పదవి ప్రకటనపై కార్యకర్తలు సంయమనం పాటించాలి

- సీనియర్ నాయకులు వెంకటరమణా రెడ్డి

ప్రజాశక్తి-గంగవరం: పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి మంత్రి పదవి ప్రకటనపై టీడీపీ కార్యకర్తలు సంయమనం పాటించాలని నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకులు వెంకటరమణా రెడ్డి సూచించారు. బుధవారం సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారం సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో అమరనాథరెడ్డి 20వేల పైచిలుకు ఓట్లతో అఖండ విజయం సాధించిన విషయం తెలిసిందేనన్నారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించడానికి ముఖ్యంగా కార్యకర్తల కృషితో ప్రజల అభిమానాన్ని కూడా మరువలేమని, తెలుగుదేశంపార్టీ అంటేనే క్రమశిక్షణకు మారుపేరని అన్నారు. సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి తప్పకుండా సముచిత స్థానం కల్పిస్తారన్న నమ్మకం తమకు ఉందని, కావున ఇది అర్థం చేసుకొని మెలగాలని ఆయన హితవు పలికారు.

మాజీ సర్పంచ్ గుండెపోటుతో మృతి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని బాలగంగనపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ దొరస్వామిరాజు బుధవారం గుండెపోటుతో మరణించారు. ఈయన నాలుగు సార్లు సర్పంచ్‌గా 1970 నుంచి 1990వరకు పదవిలో ఉన్నారు. దొరస్వామి రాజు మూడవ కుమారుడు అమెరికాలో ఉన్నందున అతను చేరుకోవడానికి గురువారం రాత్రికి అవుతుందని, అందువల్ల దొరస్వామిరాజు మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన కుమారుడు దేవరాజు పేర్కొన్నారు.

దొరస్వామిరాజు (ఫైల్‌ఫోటో)

నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ స్థాయిలో ఎంబిబిఎస్ అర్హత పరీక్ష నీట్ పరీక్షా ఫలితాల అవకతవకలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత తేజ డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల అమృత్ తేజ ఆధ్వర్యంలో స్థానిక తిరుపతి పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్ ఎదుట 'నీట్ పరీక్షని రద్దు చేసి , మరొక్కసారి నిర్వహించాలని, నీట్ పరీక్షా ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈ నెల 4న విడుదల చేసిన నీట్ పరీక్ష ఫలితాలలో అనేక అవకతవకలు జరిగాయని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కి సంబంధించిన వారు కావడం అనేక అనుమానాలను కలిగిస్తోందని వెంటనే నీట్ విడుదల చేసిన ఫలితాలను రద్దు చేసి, మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వన్నీ డిమాండు చేశారు. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షని రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్య మంత్రు లు డిమాండ్ చేస్తున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోం దని విమర్శించారు. నీట్ పరీక్ష వల్ల వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విద్యా సంవత్సరం విడుదల చేసిన పరీక్షా ఫలితాలపై , పేపర్ లీకేజీ పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ఎన్ఎస్‌యుఐ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపిపై వ్యతిరేకతతో ప్రజలు ఓట్లు వేశారు: దేవనారాయణ రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైసిపిపై వ్యతిరేకతతో ఓట్లు వేశారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి మబ్బు దేవనారాయణ రెడ్డి అన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత వైసిపి హయాంలో చోటుచేసుకున్న అక్రమాలపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. చిన్న చిన్న పొరబాట్లతో 11 సీట్లను కూటమి పార్టీలు కోల్పోయాయని, అయినా ప్రజలు తమ ఓటు తీర్పుతో చంద్రబాబుకు అధికారం కట్టబెట్టార న్నారు. ప్రజల ఆకాంక్ష మేరకు చంద్రబాబు పాలన కొనసాగుతు ందని, తప్పులు, అక్రమాలు చేసిన వారిని వదిలిపెట్టబోమన్నారు. తిరుమలలో ఈఓ ధర్మారెడ్డి శ్రీవారి నిధులను దుర్వినియోగం చేశారని, తిరుపతి నగర పాలక సంస్థలో అనేక అక్రమాలు, స్కాంలు జరిగాయని వాటిపై కూడా విచారణ కమిటీలు ఏర్పాటు చేసి, నిజాలను నిగ్గుతేలుస్తామన్నారు. ఈ సమావేశంలో విజయభాస్కర్ రెడ్డి, సిద్ధారెడ్డి, మూర్తియాదవ్, ఉమాశంకర్, బట్టురవి, శంకర్ రెడ్డి, వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత

ప్రజాశక్తి- ఏర్పేడు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని ప్రగతి సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బెంగుళూరుకు చెందిన క్రై సంస్థ పిలుపు మేరకు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు మండలంలోని బండారుపల్లి, పాయల్ సెంటర్‌లలో పిల్లలు చట్టాలు, వారి హక్కులపై నినాదాలు చేస్తూ పిల్లలు, పెద్దలు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ సిబ్బంది సురేష్, వెంకటేష్, అంగన్‌వాడీ టీచర్ వెంకట రత్నమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ జయ కుమార్, ఎస్‌సివి, సిబిఓ లీడర్లు పాల్గొన్నారు.

తిరుపతి డెస్క్: కెవిబిపురం మండలం తిమ్మసముద్రం గిరిజన కాలనీలో ప్రజా ప్రగతి ట్రస్ట్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో బడి ఈడు పిల్లలు ప్రతి ఒక్కరూ పాఠశాలకు రావాలని విద్య నేర్చుకోవాలని ఏ ఒక్కరు బడిమానకుండా విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ప్రభుత్వం అందిస్తున్న పాఠశాలల్లో సౌకర్యాలను ఉపయోగించుకుని చదువుకోవాలని కోరారు. బాల కార్మికులు కాకుండా తల్లిదండ్రులు ప్రతి ఒక్కరూ పాఠశాలకు పిల్లలను పంపించాలని తెలి పారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ మండలంలోని గిరిజన కాలనీలో అవగాహన నిర్వహించి ప్రతి ఒక్కరూ పాఠశాలకు వచ్చేందుకు తల్లిదండ్రులకు, విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై నినాదాలతో కూడిన ప్లే కార్డ్స్ ప్రదర్శిస్తూ బ్యానర్‌తో గిరిజన కాలనీలో తల్లిదండ్రులు ప్రజాప్రగతి ట్రస్ట్ సిబ్బంది గంగయ్య ఈశ్వరయ్య, తిమ్మసముద్రం సచివాలయం కార్యదర్శి ఇంటింటా ప్రదర్శన నిర్వహించి ర్యాలీ నిర్వహించారు.

రేణిగుంట : రేణిగుంట మండలం వెదుళ్ల చెరువులో బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా క్రై సంస్థ బెంగుళూరు వారి పిలుపు మేరకు ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో వెదుళ్ళ చెరువు , మల్లెమడుగు గ్రామాలలో బాలల చట్టాలు వారి హక్కులపై బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిల్లల వద్ద డ్రాయింగ్ వేయించి పిల్లలకు, పెద్దలకు బాలల కార్మికులపై అవగాహన కల్పించారు. బాల కార్మిక రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.

ఘనంగా గంగ జాతర వేడుకలు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని సోమల, నంజంపేట, ఇరికిపెంట, పొదలకుంటపల్లి, ఎస్.నడింపల్లి పంచాయతీలలో బుధవారం గంగమ్మ జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో అమ్మవారి మట్టి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. కాగా నంజంపేట, పొదలకుంటపల్లి, సూరయ్యగారిపల్లి, లక్ష్మీపురం గ్రామాలలో గంగ జాతరను వేడుకగా జరుపుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జాతర వేడుకలను జరిగే విధంగా ఎస్ఐ వెంకట నరసింహులు తన సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి కారు బోల్తా..

- గర్భిణీ మృతి

ప్రజాశక్తి-చిత్తూరుడెస్క్: అదుపుతప్పి కారు బోల్తాపడి గర్భిణీ మృతి చెందిన సంఘటన బంగారుపాలెం మండలంలోని మొగిలి ఘాట్లో బుధవారం చోటు చేసుకుంది. సిఐ లక్ష్మయ్య కథనం మేరకు.. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల టౌను చెందిన యనమల ప్రతాప్ భార్య సుదర్శన్ రాగిణి చైత్ర (33) వారి అత్త ముగ్గురు బెంగుళూరు నుంచి వేలూరు సీఎంసికి గర్భిణీ పరీక్షలు చేసుకునేందుకు వెళుతుండగా కారు రోడ్డుకు కుడి ప్రక్కన ఉన్న పిట్టగోడను ఢీకొంది. దీంతో అదుపుతప్పి బోల్తాపడి కుడి ప్రక్కన గల గోతిలోకి పడింది. ఈ సంఘటనలో సుదర్శని రాగిణి చైత్ర తీవ్రగాయాలు కాగా సంఘటన స్థలంలోనే మృతి చెందింది. శవ పరీక్ష నిమిత్తం బంగారుపాలెం వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

పశువును ఢీకొన్న బైక్

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం: పశువును బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘ టన దొరవారిసత్రం మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ సమీపంలో చెన్నై జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. పోలీసు ల కథనం మేరకు..తడ మండలంలోని మిట్ట కండ్రిగ గ్రామానికి చెందిన చంద్రశేఖర్(43), చెంగయ్య (65) బుధవారం మధ్యాహ్నం సూళ్లూరు పేట నుండి నాయు డుపే ట వైపు బైక్‌లో వెళుతూ రోడ్డు దాటుతున్న సమ యంలో పశువును ఢీకొట్టారు.

ఈ సంఘటనలో బైకు ముందు భాగం పగిలిపోయి ఇద్దరూ తీవ్ర గాయాల పాలయ్యారు. చంద్రశేఖర్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్తస్రావమైంది. వీరిని చికిత్స నిమిత్తం పోలీసు లు108 సాయంతో నాయుడు పేట సామాజిక వైద్యశాలకు తరలించారు. ప్రమాదానికి గురైన వారి బంధువులకు సమాచారం అందిం చారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తు న్నారు.